సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



**పవిత్ర ఘడియలు**
నేడు లైలతుల్ ఖద్ర్ సందర్భంగా అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. రాత్రి ఇషా నమాజ్ తర్వాత ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమవుతాయి. - 8లో



**కేకలు వేయలేక.. మంటల్లో చిక్కుకుని..**
విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటలు రాజంపేట మండలంలో ఓ దివ్యాంగురాలి ప్రాణాలు బలిగొన్నాయి. - 8లో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**



| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.74 | రూ.92 |
| రెండోరకం | రూ.50 | రూ.72 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 228 మెట్రిక్ టన్నులు

**పట్టుగూళ్ల ధరలు (రూ.లో)**



| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 459 | 565 |
| సీబీ | - | - |

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 522.50 కిలోలు




## న్యూస్‌రీల్

### మూల్యాంకనం విధులు తప్పనిసరి

రాయచోటి టౌన్ : ఈ నెల 19వ తేదీన రాయచోటిలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే పది పరీక్షల మూల్యాంకనానికి ఎంపిక చేసిన చీఫ్ ఎగ్జామినర్స్, అసిస్టెంట్ ఎగ్జామినర్స్ తప్పకుండా హాజరు కావాలని అన్నమయ్యజిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం సోమవారం సూచించారు. ఉదయం 9గంటలకు తప్పకుండా రిపోర్టు చేసుకోవాలని, ఈ విధుల నుంచి మినహాయింపు ఇచ్చే అధికారం కేవలం డీఈవో మాత్రమే ఉందని తెలియచేశారు. విధులకు గైర్హాజరయ్యేవారిపై క్రమశిక్షణ చర్యలుంటాయని హెచ్చరించారు.

### పల్లకీలో ఊరేగిన భద్రకాళీ సమేత వీరభద్రుడు



రాయచోటిటౌన్ : రాయచోటిలోని వీరభద్రాలయంలో సోమవారం రాత్రి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. తొలుత మూలవిరాట్ స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. తరువాత రంగు రంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను కూడా అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢవీధులలో ఊరేగించారు. ఈ ఉత్సవం ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి, పాలక మండలి సభ్యులు నాగభూషణం, సురేష్ కుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.

### సమస్యల పరిష్కారంతో నమ్మకాన్ని పెంచుదాం
– ఎస్పీ గంగాధర్ రావు



మహిళ సమస్య వింటున్న జిల్లా ఎస్పీ

రాయచోటి : స్పందనకు వచ్చిన సమస్యల పరిష్కారంతో ప్రజలకు నమ్మకాన్ని పెంచుదామని జిల్లా ఎస్పీ గంగాధర్ రావు అన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారంపై చర్చించారు. స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. స్పందనలో మొత్తం 56 ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు.

# హై హై నాయకా!

తెలుగుదేశం పార్టీలో అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు కరువైంది.. ద్వంద్వ వైఖరి అవలంబించే వారికి ప్రాధాన్యం పెరిగింది అనే అభిప్రాయం ఆ పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. పార్టీని నమ్ముకున్నోళ్లను కాదని జోడు గుర్రాల స్వారీ చేసే వారిని అందలమెక్కిస్తున్నారనే విమర్శలున్నాయి. నందమూరి తారకరామారావు హయాంలో సామాన్య కార్యకర్తలు సైతం ఉన్నత పదవులు పొందగా.. నేడు పరపతి ఉన్నవారికే పదవులు అన్న చందంగా పరిస్థితి తయారైంది.

- టీడీపీలో క్రియాశీలక కార్యకర్తలకు కరువైన గుర్తింపు
- పైరవీకారులు.. డబుల్ గేమ్ నేతలకే ప్రాధాన్యం
- బీజేపీ రక్షణ కవచంతో టీడీపీలో పెత్తనం చెలాయింపు
- టీడీపీనే నమ్ముకున్న వారికి శఠగోపం పెడుతున్న చంద్రబాబు




సాక్షి ప్రతినిధి, కడప: నాడు కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి ఆయువుపట్టు. నేడు పైరవీకారులదే పైచేయి. ఎన్టీఆర్ హయాంలో ఆర్టీసీ కండక్టర్ బగ్గిడి గోపాల్ లాంటివారు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అదే చంద్రబాబు హయాంలో డబ్బున్నోడికే పార్టీ టికెట్.. పరపతి ఉన్నోడి సిఫార్సులే కీలకంగా పరిగణిస్తున్నారు. కష్టపడ్డవారిని కరివేపాకులా తీసి పారేస్తున్నారు. ఎన్నికలు సమీపించే కొద్దీ కొత్త ముఖాలు తెరపైకి వస్తున్నాయి. అన్న ఒక పార్టీ, తమ్ముడు మరోపార్టీలో ఉన్నప్పటికీ కూడా అలాంటోళ్లకే టీడీపీలో ప్రాధాన్యత ఇస్తున్నారు. అధినేత విచిత్ర వైఖరిపై తెలుగు తమ్ముళ్లు మథనపడుతున్నారు.

కడప బిల్టప్ సమీపంలో పుత్తా ఎస్టేట్స్‌లో మంగళవారం జోన్–5 తెలుగుదేశం పార్టీ ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. హిందూపురం, అనంతపురం, కర్నూలు, నంద్యాల, కడప పార్లమెంటు నియోజకవర్గాల టీడీపీ నేతలు పాల్గొననున్నారు. రాబోయే ఎన్నికలకు సంబంధించి దిశా నిర్దేశం చేయడమే ప్రధాన ఉద్దేశం. ఈ సందర్భంగా టీడీపీ అధిష్టానం వైఖరిని పలువురు తప్పుబడుతున్నారు. పార్టీ కోసం పనిచేసిన వారిని కాదని, నాయకుల చుట్టూ తిరిగేవారికే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడుతున్నారు. ప్రజాబలం లేకపోయినా కొంత మందికి అధినేత ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడాన్ని పలువురు నిలదీస్తున్నారు.

**చక్రం తిప్పుతున్న పోట్లదుర్తి బ్రదర్స్...**

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లు సోదర ద్వయం రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, మాజీ సర్పంచ్ సీఎం సురేష్ చక్రం తిప్పారు. పోట్లదుర్తి బ్రదర్స్‌గా పెత్తనం చెలాయించారు. అధికారం కోల్పోగానే సీఎం రమేష్ టీడీపీని వదిలి బీజేపీలో చేరిపోయారు. నాలుగేళ్లుగా ఎలాంటి ప్రజా ఉద్యమాలు చేపట్టని సీఎం సురేష్ ఒక్కమారుగా ప్రొద్దుటూరులో టీడీపీ టికెట్‌పై పోటీ చేయనున్నట్లు ఆంతరంగికుల వద్ద ప్రచారం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఉన్నతి కోసం ఏమాత్రం పనిచేయని వారిని చంద్రబాబు సైతం ఆదరిస్తున్నారు. ప్రొద్దుటూరు పరిధిలో శక్తిమేరకు టీడీపీ జెండా ఎగురవేసిన గండ్లూరు ప్రవీణ్ కుమార్‌రెడ్డిని ఒక్కమారుగా తెరవెనుకకు నెట్టేశారు. టీడీపీలో ఇదేం ఖర్మ అంటూ ఆ పార్టీ సీనియర్లు మథనపడుతున్నారు. మరోవైపు పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలోనే పనిచేస్తున్న మాజీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి లాంటి వారిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిన్ను నమ్మం బాబు..**

దిక్కుమాలిన రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్న చంద్రబాబునాయుడిని నమ్మే పరిస్థితి లేదని టీడీపీ అభిమానులు వెల్లడిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ కోసమే కష్టపడ్డ వారికి పార్టీలో ప్రాధాన్యత కల్పించాల్సి ఉండగా అలా కాదని డబుల్ గేమ్ నేతలకే ప్రాధాన్యత ఇవ్వడంపై మండిపడుతున్నారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా సీఎం రమేష్, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, దేవగుడి ఆదినారాయణరెడ్డి, టీజీ వెంకటేష్ కుటుంబాలను చూపుతున్నారు. సీఎం రమేష్ బీజేపీలో కొనసాగుతుండగా ఆయన సోదరుడు సీఎం సురేష్ టీడీపీలో ఉన్నారు. నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి బీజేపీలో ఆయన తమ్ముడు కిశోర్‌కుమార్‌రెడ్డి టీడీపీలో, దేవగుడి ఆదినారాయణరెడ్డి బీజేపీలో ఆయన సోదరులు నారాయణరెడ్డి, శివనాథరెడ్డిలు టీడీపీలో కొనసాగుతున్నారు. అలాగే టీజీ వెంకటేష్ బీజేపీలో ఉండగా ఆయన తనయుడు టీజీ భరత్ కర్నూలు టీడీపీ టికెట్ ఆశిస్తున్నారు. సీఎం రమేష్ నాయుడు బీజేపీ ఎంపీ అభ్యర్థిగా వైజాగ్‌లో పోటీ చేయాలని ఓవైపు ప్రయత్నాలు చేస్తుంటే సోదరుడు సీఎం సురేష్ నాయుడు ప్రొద్దుటూరు టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉండేందుకు రెడీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఇలాంటి ఉదాహరణలను వివరిస్తూ టీడీపీ సీనియర్లు పెదవి విరుస్తున్నారు. అప్పట్లో 'నిన్ను నమ్మం బాబు' అంటూ వైఎస్సార్‌సీపీ నినాదం ఇచ్చింది, అదే నినాదాన్ని ప్రస్తుతం టీడీపీ కేడర్ అందుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తుండడం విశేషం.

## నేడు టీడీపీ అధినేత చంద్రబాబు కడపకు రాక

**ప్రాంతీయ సదస్సుకు హాజరు**

కడప రూరల్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు మంగళవారం కడపకు రానున్నారు. మధ్యాహ్నం 12.15 గంటలకు హైదరాబాదులోని బేగంపేట విమానాశ్రయం నుంచి విమానం ద్వారా కడప విమానాశ్రయానికి 1.15 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన పుత్తా ఎస్టేట్ మైదానంలో నిర్వహించే ఆ పార్టీ ప్రాంతీయ సదస్సులో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు పుత్తా ఎస్టేట్ నుంచి బయలుదేరి 5.45 గంటలకు అమీన్‌పీర్ దర్గాకు చేరుకుంటారు. అక్కడ నిర్వహించే ఇఫ్తార్ విందులో పాల్గొంటారు. 7.00 గంటలకు అమీన్‌పీర్ దర్గా నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 8.00 గంటలకు బద్వేలులోని బిజివేముల వీరారెడ్డి కన్వెన్షన్ చేరుకుని రాత్రికి బస చేస్తారు. బుధవారం ఉదయం గిద్దలూరులో జరిగే కార్యక్రమాలకు బయలుదేరి వెళతారు.

## నిర్దేశించిన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి

- తప్పులు లేని ఓటర్ల జాబితా తయారుచేయాలి
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : భూసమస్యల శాశ్వత పరిష్కారానికి రీసర్వే పక్కాగా, పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ రీసర్వే, సాధారణ ఎన్నికలు, వసతి గృహాల పర్యవేక్షణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో నిర్ణీత కాలపరిమితిలోగా హద్దురాళ్ల ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి కాలంలో నీటిసమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేసేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ జయరాజ్, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, గ్రామ వార్డు సచివాలయాల ఏఓ మనోహర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

**స్పందన అర్జీదారులకు అధిక ప్రాధాన్యత**

స్పందన కార్యక్రమంలో అందిన అర్జీదారుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ సత్యనారాయణ, సర్వేశాఖ ఏడీ జయరాజ్, వ్యవసాయశాఖ జేడీ ఉమా మహేశ్వరమ్మలు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేసి నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని చెప్పారు.

## మాటమీద నిలిచే ముఖ్యమంత్రిని మనస్ఫూర్తిగా ఆశీర్వదించండి

**రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి**

పీలేరు : ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ మాటమీద నిలిచే ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక ఏపీఐఐసీ లేఅవుట్‌లో మూడో విడత ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 1.10 లక్షల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ కాగా ఇందులో ఒక్క పీలేరులోనే 10 వేల పట్టాలు మంజూరయ్యాయన్నారు. ఇంకా రెండు వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో ఒక ఇల్లు తెచ్చుకోవాలంటే ప్రజలు నానా ఇబ్బందులు పడేవారని, జన్మభూమి కమిటీ ఆమోదించాల్సి వచ్చేదన్నారు. చంద్రబాబు హయాంలో ఎన్నికలకు ముందు హడావిడిగా స్లిప్పులు ఇచ్చి ఇళ్ల స్థలాలు చూపకుండా మోసం చేశారని గుర్తు చేశారు. ప్రజలు చెప్పులు అరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా పథకాలు అందేవి కావన్నారు. అదే మన జగనన్న ప్రభుత్వంలో కులం, మతం, వర్గం చూడకుండా అందరికీ మేలు జరగాలనే మంచి మనుస్సుతో అర్హత గల అందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నారని తెలిపారు. జగనన్న మాదిరి చెప్పినమాట మీద నిలబడే ముఖ్యమంత్రి గతంలో ఎవరూ లేరని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి, అన్ని పార్టీల నాయకులు చెప్పే మాటలు విని మీకు మంచి చేసిన వారికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డిల సహకారంతో పీలేరును అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గిరీషా, ఆర్‌డీఓ రంగస్వామి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, నియోజకవర్గ పరిశీలకుడు సహదేవరెడ్డి, ఏపీఎండీసీ, ఏపీ హౌసింగ్ డైరెక్టర్లు హరీష్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కలెక్టర్

## అన్నమయ్య విగ్రహ ఏర్పాటు హర్షదాయకం

- రాయచోటి రింగ్ రోడ్డు సర్కిల్‌లో అన్నమయ్య విగ్రహావిష్కరణ
- పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్యను గుండెల్లో పెట్టుకొని పూజిస్తామని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌లు అన్నారు. సోమవారం కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల సమీపంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన అన్నమయ్య విగ్రహాన్ని వారు విగ్రహ దాతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాళ్లపాక అన్నమాచార్యుల పేరుతో అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామిని కీర్తిస్తూ అన్నమయ్య 32 వేల కీర్తనలు రచించారన్నారు. అన్నమయ్య సంకీర్తనల్లో ఎన్నో ఉన్నత, సమానత్వపు భావాలు కనిపిస్తాయన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో అంతటి మహానుభావుడి విగ్రహం ఏర్పాటు కావడం హర్షదాయకమన్నారు.



అన్నమయ్య విగ్రహావిష్కరణలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

**సర్కిల్ దెవలపర్లను అభినందించిన ఎమ్మెల్యే, కలెక్టర్**

అన్నమయ్య సర్కిల్ సుందరీకరణ, అభివృద్ధి పనులకు సహకరించిన దాతలు మాజీ రెస్కో చైర్మన్ కృష్ణారెడ్డి, సాకేత్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్లు సురేష్‌రెడ్డి, నరేష్‌రెడ్డిలను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీషాలు అభినందించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్‌చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ గంగాప్రసాద్, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్లు వండాడి వెంకటేశ్వర్లు, కర్ణపు విశ్వనాథ రెడ్డి, మదనపల్లె పార్టీ పరిశీలకులు హబీబుల్లాఖాన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ బయారెడ్డి, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పబ్బిశెట్టి సురేష్, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లించాలి

**జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు**

కడప అగ్రికల్చర్ : జిల్లా వ్యాప్తంగా రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించాలని అందుకు అనుగుణంగా రైతులకు అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు పేర్కొన్నారు. సోమవారం ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కార్యాలయంలో సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ప్రకృతి వ్యవసాయంలోకి తీసుకు రావడానికి ప్రకృతి వ్యవసాయ ప్రణాళిక చాలా కీలకం అన్నారు. రైతులకు ఆదాయం పెంచాలంటే 365 రోజులు భూమి మీద పంటలు ఉండేలాగా రైతులకు పంటల సరళిపైన తగిన శిక్షణ ఇవ్వాలని తెలిపారు. అడిషనల్ డీపీఎం వసంత కుమారి, డీపీఎంయూ స్టాఫ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు

# అభివృద్ధి మంత్రం.. సంక్షేమ సూత్రం

- ప్రగతి పథంలో అన్నమయ్య జిల్లా
- ఈ ఏడాదిలో 1.10 లక్షల మందికి ఇంటి పట్టాలు
- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు
- 'సాక్షి'తో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



పునర్విభజనలో భాగంగా పురుడు పోసుకున్న అన్నమయ్య జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నాను.. ఒకవైపు అభివృద్ధి...మరోవైపు అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాను. జిల్లా ఏర్పడిన ఏడాదిలోనే అనేక రంగాలలో ముందడుగులో ఉంది. ముఖ్యమంత్రి దిశా నిర్దేశంతో జిల్లాలో 1.10 లక్షల మందికి ఇంటి పట్టాలు అందించడం ఒక చరిత్ర అయితే...సుమారు ఇప్పటికే జగనన్న కాలనీల్లో 20 వేల ఇళ్లను పూర్తి చేయడం మరో చరిత్ర. రానున్న కాలంలో కొత్త ఊర్లు ఆవిర్భవించబోతున్నాయి. ఒకటేమిటి..అన్నమయ్య జిల్లాకు సంబంధించి స్టేడియం మొదలుకుని సరదాగా గడిపే శిల్పారామాల వరకు అన్నీ తీసుకు వస్తున్నాము. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మంగంపేట భూ సేకరణ, పునరావాస సమస్యలను పరిష్కరించాము. కొత్త జిల్లాలో అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు అందిస్తున్న సహకారం మరువలేనిది.. ఈ ఏడాదిలో జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి పథంలో తీసుకు వెళతాము.. అని జిల్లా కలెక్టర్ పిట్టికోపు శివరామెగౌడ గిరీషా తెలిపారు. ఆయన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

– సాక్షి రాయచోటి

సాక్షి ఇంటర్వ్యూ

**ప్రజలకు దగ్గరగా పాలన**

అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి ఏప్రిల్ 4వ తేది నాటికి సరిగ్గా ఏడాది పూర్తయింది. కొత్త జిల్లా అయినప్పటికీ గతంలో పనిచేసిన అనుభవంతో అభివృద్ధికి సంబంధించి అవగాహన ఉంది. దీంతో జిల్లాలో అడుగు పెట్టగానే అనుకున్న లక్ష్యాల వైపు ముందుకు వెళ్లా. ప్రత్యేకంగా కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రజల వద్దకే పాలన వచ్చేసింది. ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా ప్రజలు అధికారుల వద్దకు వస్తున్నారు. అంతేకాకుండా నేను కూడా జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాను. అంతేకాకుండా సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు అందుతున్న తీరును కూడా ప్రతి గురువారం పరిశీలిస్తున్నాను.

**పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం**

అన్నమయ్య జిల్లాకు కలెక్టర్‌గా వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నా. ప్రధానంగా ముదివీడు, శ్రీనివాసపురం ప్రాజెక్టులకు సంబంధించి పనులు పూర్తి చేయడం... రాయచోటి పరిధిలోని నాలుగు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. అంతేకాకుండా హెచ్ఎన్ఎస్ఎస్ లింక్ కెనాల్ దాదాపు పూర్తి కావచ్చింది. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మంగంపేట పునరావాస సమస్యను ఇటీవలే పరిష్కరించాను. ఎమ్మెల్యే, ఎంపీల సహకారంతో మంగంపేట బెరైటీస్‌కు సంబంధించి విస్తరణకు అవసరమైన భూ సేకరణ, పునరావాస చర్యలు ప్రజలను ఒప్పించి పరిష్కరించాం. పునరావాస చర్యల్లో భాగంగా 700 కుటుంబాలకు సంబంధించిన సమస్యను పరిష్కరించడం గర్వంగా ఉంది.

**కరువును జయించేలా పథక రచన**

కరువు ప్రాంతంగా గుర్తింపు పొందిన అన్నమయ్య జిల్లాలో రానున్న కాలంలో కరువు రక్కసి కనబడకుండా చేస్తాం. ప్రధానంగా జిల్లాలోని వెలిగల్లు మొదలుకొని జిల్లాలోని రిజర్వాయర్లన్నింటినీ నీటితో నింపుతాం. అంతేకాదు.. ఉన్న చెరువులన్నింటినీ నీటితో నింపడం ద్వారా భూగర్భ జలాల పెంపు అనివార్యం. దీంతోపాటు బోర్లలో, బావుల్లో నీటి శాతం పెరిగి రైతులు వ్యవసాయాన్ని పండుగ చేసేలా చేస్తాం.

**కొత్త ఊర్లు ఆవిర్భావం**

అన్నమయ్య జిల్లాలో కొత్త ఊర్లు ఆవిర్భవిస్తున్నాయి. ఇల్లులేని ప్రతి నిరుపేదకు ఇల్లు ఇవ్వాలన్న ముఖ్యమంత్రి సంకల్పం మేరకు అర్హులందరికీ అందించాం. జిల్లాలో 1.10 లక్షల మందికి పట్టాలు ఇచ్చాం. అంతేకాదు జగనన్న లే అవుట్లలో ఇప్పటికే సుమారు 20 వేల గృహాలు పూర్తయ్యాయి. మరో 40 వేల గృహాలకు సంబంధించి పనులు జరుగుతున్నాయి. రానున్న కాలంలో కొత్త ఊర్లు కనిపించనున్నాయి.

**జగనన్న పాల వెల్లువలో నెంబర్ వన్**

జిల్లాలో జగనన్న పాల వెల్లువ కింద ప్రతిరోజు 40 వేల లీటర్లు సేకరిస్తున్నాం. రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా నెంబర్ వన్ అని చెప్పడానికి గర్వంగా ఉంది. తొలినాళ్లలో తక్కువ పాల సేకరణ జరిగేది. తర్వాత కాలంలో పెంచుకుంటూ వచ్చాం. రానున్న కాలంలో మరో 200 గ్రామాల్లో విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నాం.

**సంక్షేమ పథకాలు అందించడంలోనూ పోటీ పడుతున్నాం**

రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పోటీ పడుతూ సంక్షేమం విషయంలో కొద్దిగా అటు, ఇటు అయినా మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నాం. పేదలందరికీ శాచురేషన్ పద్ధతిలో సంక్షేమ పథకాలను గ్రామీణ స్థాయిలో అర్హులకు అందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎక్క డా కూడా తేడా లేకుండా ముందుకు వెళుతున్నాం.

**అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతాం**

జిల్లాకు సంబంధించి అది, ఇది అని కాకుండా అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం. ప్రధానంగా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. జిల్లా కలెక్టరేట్‌కు స్థల ఎంపిక మొదలుకొని పోలీసు పెరేడ్ గ్రౌండ్, పీటీసీకి స్థలం కేటాయింపు, స్టేడియం, శిల్పారామం, నగర వనం, పార్కుల స్థలాలు ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపాం. జిల్లాకు మూడు కేంద్రీయ విద్యాలయాలు వచ్చాయి. అలాగే ఒక మెడికల్ కాలేజీ, వెలిగల్లు వద్ద 45 ఎకరాల్లో టూరిజం అభివృద్ధికి చర్యలు, రెండు వేల ఎకరాలకు సంబంధించి అసైన్‌మెంట్‌కు సిద్ధం చేస్తున్నాం. ఆరు నియోజకవర్గాల్లో ఎంఐజీ లే అవుట్లు వేస్తున్నాం. రాయచోటిలో త్వరలో ప్లాట్లను అందించడంతోపాటు మౌలిక వసతులు కల్పిస్తున్నాం. రీ సర్వే వేగంగా జరుగుతోంది. ప్రత్యేకంగా పారిశ్రామిక ప్రగతికి సంబంధించి ఒకటి, రెండు పెద్ద పరిశ్రమలు తెచ్చేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నాం. అందుకు అవసరమైన సుమారు 2 వేల ఎకరాల భూమిని కూడా సేకరిస్తున్నాం.

**ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం మరువలేనిది**

కొత్తగా జిల్లా ఏర్పడిన తొలి రోజుల్లో కొంతమేర ఇబ్బందులు ఉండేవి. అయితే కొద్దిరోజుల్లోనే ఎక్కడికక్కడ వసతులు కల్పించడం, మౌలిక సదుపాయాల కల్పనతో అన్ని సమస్యలు తీరిపోయాయి. జిల్లాలో అన్నిశాఖలకు సంబంధించి హెచ్ఓడీలు మొదలుకొని ఉద్యోగులందరూ ఎవరి పనులు వారు చేసుకుంటూ సహకారం అందిస్తున్నారు. ప్రధానంగా ఎంపీ, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్, ప్రజాప్రతినిధులందరూ మంచి సహకారాన్ని అందిస్తున్నారు. జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరి కృషి ఉంది.

## క్లుప్తంగా

### ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలి మృతి



మదనపల్లె : గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు సోమవారం మృతి చెందింది. మదనపల్లె రూరల్ పరిధిలోని బైపాస్ రోడ్డులో ఓ వృద్ధురాలు రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వెళ్లిపోయింది. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు తన పేరు నాగమ్మ (70) అని మాత్రమే చెప్పింది. మిగిలిన వివరాలు చెప్పలేదని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి బంధువులు ఎవరైనా ఉంటే స్టేషన్‌కు వచ్చి వివరాలు తెలియజేయాలని పోలీసులు తెలిపారు.

### బైక్ బోల్తా: వ్యక్తికి గాయాలు

వాల్మీకిపురం : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండలంలోని పునుగుపల్లి వద్ద చోటు చేసుకొంది. వివరాలు.. గుర్తు తెలియని వ్యక్తి అతిగా మద్యం తాగి వాల్మీకిపురం నుంచి చింతపర్తి వైపు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. పునుగుపల్లి క్రాస్ వద్ద స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని 108లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వాహనానికి సంబంధించిన రికార్డులు, ఎ లాంటి వివరాలు లభ్యం కాకపోవడంతో అతను ఎవరో తెలియరాలేదు. ఏఎస్సై లీలావతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పవిత్ర ఘడియలు

ఏడాదికాలంగా నిరీక్షిస్తున్న పవిత్ర ఘడియలు సమీపించాయి. రంజాన్ మాసంలో కఠిన ఉపవాసదీక్షలకు తోడు జాగారం చేయడం వల్ల పుణ్యం వస్తుందని ముస్లింల నమ్మకం. అత్యున్నత మాసమైన రంజాన్‌లో మహోన్నతమైన రాత్రి లైలతుల్ ఖదర్. ఈ వేడుకలకు జిల్లావ్యాప్తంగా ముస్లిం సోదరులు సంసిద్ధమవుతున్నారు. మసీదుల్లో జాగారం, ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- నేడు మహోన్నత రాత్రి లైలతుల్ ఖదర్
- మసీదుల్లో జాగారానికి ఏర్పాట్లు

మదనపల్లె సిటీ : ముస్లింలకు రంజాన్ మాసమంతా పవిత్రమైనదే. ఆత్మ ప్రక్షాళనకు, అల్లాహ్ సూచన మేరకు జకాత్ ద్వారా ఇతరులకు సాయం చేసేందుకు కూడా అవకాశం లభిస్తుంది. ఈ మాసం చివరి పది రోజుల్లో ఐదు బేసి రాత్రులను తాఖ్‌రాత్‌లు(పవిత్రమైన రాత్రులు)గా భావిస్తారు. ఇందులోనూ మూడో బేసి రాత్రి 'లైలతుల్ ఖదర్ (బడీరాత్) అత్యంత ముఖ్యమైంది. ఈ రేయి శ్రేష్ఠమైనది.దీనిని పురస్కరించుకుని జిల్లాలోని ముస్లింలు గణనీయంగా ఉన్న మదనపల్లె, రాయచోటి,రాజంపేట,వాల్మీకిపురం, పీలేరు, గుర్రంకొండ, రైల్వేకోడూరు ప్రాంతాలతో పాటు పలు చోట్ల మంగళవారం బడీరాత్ (సతామి) పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ముస్లింల దివ్య గ్రంథం ఈ రాత్రిలోనే దివి నుంచి భువిపైకి అవతరించిందని ఖురాన్‌లో పేర్కొనడం జరిగింది. దీనిని సూచిస్తూ ఖురాన్‌లో .. ఇన్నా అన్‌జల్‌నాహు.. అనే ఓ ప్రత్యేక సూరా కూడా ఉంది. రంజాన్ మాసంలో చేపట్టే ప్రత్యేక తరావీ ప్రార్థనల్లో దివ్య ఖురాన్‌ను పఠిస్తూవచ్చి ఈ రాత్రిలోనే పూర్తి చేస్తారు.

**ప్రత్యేక ప్రార్థనలు**

ఈమాసం చివరి పది రోజుల్లో ఐదు బేసి రాత్రులను తాఖ్‌రాత్‌లు (పవిత్రమైన రాత్రులు)గా భావిస్తారు. సాధారణంగా ఈ ఐదు రోజుల్లో మసీదులు, ఇళ్లలో కూడా రాత్రంతా నవాజ్ చదవడం, పవిత్ర ఖురాన్ పఠించడం, జికర్ చేయడం, ఇతర అధ్యాత్మిక ప్రసంగాలతో తెల్లవారుజామున సెహరి సమయం వరకు గడుపుతారు. ఈ మాసంలో చివరి పది రోజుల్లో వచ్చే బేసి రోజుల్లో లైలతుల్ ఖదర్ (బడీరాత్) అత్యంత ముఖ్యమైంది. పవిత్రమైన ఈ బేసి రోజుల్లోనే లైలతుల్ ఖద్ర్ ఉంటుందని దైవం మానవ లోకానికి సూచించారు. ఈ సందర్భంగా రాత్రంతా పశ్చాత్తాప భావనతో దైవ సన్నిధిలో గడిపి ధన్యత పొందేందుకు ప్రయత్నిస్తారు. దైవం పాపాలన్నింటినీ క్షమిస్తాడని పెద్దలు పేర్కొంటారు. మంగళవారం రాత్రి లైలతుల్ ఖద్ర్ (బడీరాత్) కోసం ఆసక్తిగా ఎదురు చూసస్తున్నారు. ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమయ్యారు.



లైలతుల్ ఖద్ర్ సందర్భంగా అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. రాత్రి ఇషా నమాజ్ తర్వాత రోజువారీగా జరిగే తరావీ అనంతరం ఈ ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా అధ్యాత్మికవేత్తల ప్రసంగాలు, పవిత్ర ఖురాన్ పఠనం, జికర్, తహజూద్ నమాజ్ తోపాటు మసీదుల్లో సెహరీ ఏర్పాట్లు చేశారు.

**ఆరాధ్యమైన రాత్రి**

లైలతుల్‌ఖద్ర్ రంజాన్‌మాసంలో ఆరాధ్యనీయమైంది. ఈ రోజు చేసే ప్రార్థనలను తప్పక మన్నిస్తాడన్న విశ్వాసం ముస్లింల్లో ఉంది. అందుకే రెట్టించిన భక్తితో ఈ రాత్రంతా అల్లాహ్‌పై మనసు నిలిపి ప్రార్థనలు చేస్తారు. అందుకే ఈ రోజును అత్యంత పవిత్రమైందిగా భావిస్తారు.

\- హాఫీజ్ ఇక్బాల్‌సాహెబ్,
ప్రభుత్వ సర్‌ఖాజీ, మదనపల్లె

## ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

మదనపల్లె : కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని నక్కలదిన్నెకు చెందిన సయ్యద్ చాంద్‌బాషా(30) కూలిపనులు చేస్తూ జీవించేవాడు. ఇతను మద్యానికి బానిసై సంపాదించిన డబ్బు తాగుడుకు ఖర్చు పెడుతుండటంతో కుటుంబపోషణ భారమైంది. ఈక్రమంలో ఈనెల12న కుటుంబసమస్యల కారణంగా మనస్తాపం చెంది ఎవరికీ తెలియకుండా ఎలుకలమందు తాగాడు. అయితే 15వరకు తాను పురుగుమందు తాగినట్లుగా ఎవరికీ చెప్పకుండా దాచాడు. ఈనెల 15వతేదీ శనివారం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు బాధితున్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. రుయాలో చికిత్స పొందుతూ సయ్యద్ చాంద్‌బాషా సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరి నజీమా ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు.

### ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యకు యత్నించారు. పెద్దమండ్యం మండలం దేసే నాయక్‌తాండాకు చెందిన అనసూయమ్మ (37) సోమవారం ఉదయం కడుపునొప్పి తాళలేక పురుగుల మందుతాగింది. కుటుంబ సభ్యులు గమనించి మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం అగ్రహారంకు చెందిన కాంతమ్మ (47) కుటుంబ కలహాలతో సోమవారం ఇంటిలో పురుగులమందుతాగింది. ఆమెను మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

### పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

కేవీపల్లె : పెద్దల నుంచి రక్షణ కల్పించాలని ఓ ప్రేమజంట పోలీసులను ఆశ్రయించింది. వివరాలిలా ఉన్నాయి. కేవీపల్లెకు చెందిన రెడ్డిసాహెబ్ కుమారుడు రెడ్డిజవహర్ (27), వగళ్లకు చెందిన ధనుంజయ కుమార్తె రెడ్డిరాధ (26) గత కొన్ని సంవత్సరాలుగా పరస్పరం ప్రేమించుకున్నారు. ఇద్దరి మతాలు వేరు కావడంతో వారి వివాహానికి పెద్దలు అంగీకరించలేదు. దీంతో సోమవారం రిజిస్టర్ వివాహం చేసుకున్నారు. అనంతరం తమకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించారు.

### నిందితుడికి జైలుశిక్ష

చిన్నమండెం : మండలంలోని కేశాపురం గ్రామం ముండ్లవారికోటలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి బాధితుడు రామక్రిష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు 11.08.2017 లో నిందితుడు దేవరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆ కేసుకు సంబంధించి రాయచోటి ఏజేఎఫ్‌సీఎం కోర్టులో ఏపీపీ సుహాసిని వాదోపవాదాలు విన్న తర్వాత రాయచోటి జడ్జి డాక్టర్ శారద నిందితుడికి 6 నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

## 58 ఏళ్ల వయస్సులో టీచర్ ఉద్యోగం



ధనుంజయ కుమార్

కురబలకోట : 58 ఏళ్ల టైలర్‌కు ఇప్పుడు ప్రభుత్వ టీచర్ ఉద్యోగం ఏంటని ఆశ్చర్యపోతున్నారా..? అవును ఇది నిజమే. అంతేకాదు మరో రెండేళ్లలో రిటైర్ కావాల్సి ఉన్నట్లు ఉత్వర్వుల్లో ఉంది. తర్వాత ప్రభుత్వ నిర్ణయాన్ని బట్టి పదవీ విరమణ పెంపు ఆధారపడి ఉంటుంది. తిరుపతి ఎంఆర్ పల్లె శాంతి నగర్‌కు చెందిన కె. ధనుంజయ కుమార్‌కు 25 ఏళ్ల నిరీక్షణ తర్వాత టీచర్ ఉద్యోగం లభించింది. టైలర్ కాస్తా మాస్టారు కావడంతో ఆయన ఆనందానికి అవధులు లేవు. వివరాలలోకి వెళితే.. కె ధనుంజయకుమార్ ఎంఎ బీఈడీ చేశారు. 1998లో జరిగిన డీఎస్సీలో ఫస్ట్ లిస్ట్‌లో క్వాలిఫై అయ్యారు. అప్పటి సీఎం చంద్రబాబు వీరికి ఉద్యోగం రాకుండా సెకండ్ లిస్టులో ఎంపికైన వారికి ఉద్యోగాలు ఇచ్చారు. దీంతో ఈ డీఎస్సీ వివాదాస్పదంగా మారింది. ఈ బ్యాచ్‌కు చెందిన వారు అప్పటినుంచి కోర్టులో కేసు వేశారు. ఉద్యోగాలు ఇవ్వాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినా గత ప్రభుత్వం కాలయాపన చేస్తూ వచ్చింది. ఆశలు వదులుకుని వివిధ వృత్తులు చేపట్టి జీవనం సాగించసాగారు. ఇతను కూడా టైలర్ పని చేసుకుంటూ కాలం వెళ్లదీయసాగారు. అప్పటి డీఎస్సీ క్వాలిఫై అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఇతనితో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 503 మందికి టీచర్ ఉద్యోగాలు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా ధనుంజయ కుమార్‌కు కురబలకోట మండలంలోని దిగువ గొల్లపల్లె ప్రాథమిక పాఠశాల తెలుగు టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. మంగళవారం ఆయన జాయిన్ అయ్యారు. ఆయన మాట్లాడుతూ తమను ఆనాటి సీఎం చంద్రబాబు ఉద్యోగాలు ఇవ్వకుండా నరక యాతన పెట్టాడన్నారు. ఆయన వల్లే మా జీవితాలు దెబ్బతినడమే కాదు అస్తవ్యస్తం అయ్యాయన్నారు. అర్హత ఉండి కూడా ఉద్యోగం రాక కుటుంబ పోషణకు అష్ట కష్టాలు పడ్డామన్నారు. శక్తివంచన లేకుండా విద్యార్థులకు పాఠాలు బోధిస్తానన్నారు. 25 ఏళ్లకు ముందు రాసిన పరీక్షకు ఇప్పుడు ఉద్యోగం రావడం తీరని నష్టమేనన్నారు. ఎంతో జీవితాన్ని కోల్పోయామన్నారు. ఆలస్యంగానైనా ప్రభుత్వ ఉద్యోగం రావడంతో బంధుమిత్రుల్లో కూడా గౌరవ పెరిగిందన్నారు. తాను బీఎల్ కూడా పూర్తి చేశానన్నారు. పదవీ విరమణ తర్వాత లాయర్‌గా ప్రాక్టీసు కొనసాగిస్తానన్నారు. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. కురబలకోట మండలంలో ఏడుగురికి ఇలాంటి టీచర్ ఉద్యోగాలు లభించినట్లు ఎంఈఓ ద్వారకనాథ్ సోమవారం తెలిపారు.

## ఓవర్‌టేక్ చేయబోయి ప్రమాదం



నీలమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

బి.కొత్తకోట : జాతర చూసుకుని అక్క ఇంటికి వెళ్తున్న మహిళ మార్గమధ్యలో ప్రమాదానికి గురై మృతి చెందిన ఘటన సోమవారం ఉదయం బి.కొత్తకోట సమీపంలోని మల్లెల క్రాస్ వద్ద జరిగింది. ఎస్ఐ కే.రామమోహన్ కథనం మేరకు వివరాలు.. కర్ణాటక రాష్ట్రం బాలిరెడ్డిగారిపల్లెకు చెందిన నీలమ్మ (30) తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో జరిగిన జాతరకు శనివారం వెళ్లింది. ఆదివారం అక్కడే ఉండగా పెద్దతిప్పసముద్రం మండలం గొడుగువారిపల్లెలో ఉంటున్న అక్క రాధ ఇంటికి సోమవారం తెల్లవారుజామున అన్న కొడుకు నవీన్ ద్విచక్రవాహనంలో బయలుదేరింది. వెంట నీలమ్మ ఏడేళ్ల కుమారుడు ధనుష్ కూడా ఉన్నాడు. బైక్ బి.కొత్తకోటకు చేరుకుని పెద్దతిప్పసముద్రం మార్గంలో మల్లెల క్రాస్ వద్ద నవీన్ (19) ఎదురుగా వెళ్తున్న బైక్‌ను వర్‌టేక్ చేసి ముందుకు వెళ్తుండగా పెద్దతిప్పసముద్రం వైపు నుంచి బి.కొత్తకోటకు వస్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నీలమ్మ ఘటనాస్థలంలో మృతి చెందింది. ఆమె కుమారుడు ధనుష్‌కు గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ పరిశీలించారు.పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. నవీన్ బైక్‌ను నిర్లక్ష్యంగా నడపడంవల్లే ప్రమాదం జరిగిందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు మండలం ఎస్. ఉప్పలపాడు గ్రామంలో సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బాపనపల్లె శివ (33) మృతి చెందాడు. ఎస్.ఉప్పలపాడు గ్రామానికి చెందిన బాపనపల్లె శివ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. పనులు ముగించుకుని రాత్రి 9 గంటల సమయంలో స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. రైల్వే వంతెన దాటిన తర్వాత గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో శివ అక్కడికక్కడే మృతి చెందాడు.

# కేకలు వేయలేక.. మంటల్లో చిక్కుకుని..

- షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం
- దివ్యాంగురాలు లావణ్య మృతి



మృతి చెందిన లావణ్య

రాజంపేట రూరల్ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటలు మాటలు రాని కాకర్ల లావణ్య (27)అనే దివ్యాంగురాలిని బలిగొన్నాయి. ఈ హృదయ విషాదకర సంఘటన సోమవారం రాజంపేట మండలం పెద్దూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దూరుకు చెందిన కాకర్ల చిన్నయ్య ఆచారి కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.ఇతనికి భార్య చంద్రమ్మ, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తన రెక్కల కష్టంతో ముగ్గురు కుమార్తెలు, కుమారుడికి పెళ్లిళ్లు చేశాడు.లావణ్య నాలుగో సంతానం.ఈమెక మాటలు సరిగా రావు. నడవలేని పరిస్థితి. అమ్మానాన్నలు లావణ్యను పసిపాపలాగా చూసుకుంటున్నారు.కుమార్తె పరిస్థితి చూసి కుమిలిపోయేవారు.

రెండురోజుల కిందట చంద్రమ్మ రాజంపేటలో నివాసం ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లింది. దీంతో కుమార్తెకు తండ్రే అన్ని సేవలు చేస్తుండేవారు. సోమవారం ఉదయం నిద్రిస్తున్న లావణ్యను ఇంటిలో ఉంచి చిన్నయ్య ఆచారి అదే గ్రామంలో ఉన్న తన పెద్ద కుమార్తె వద్దకు వెళ్లాడు. ఉదయం 7గంటల సమయంలో టేబుల్ ఫ్యాన్ షార్ట్ షర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. మంటలు లావణ్య పడుకున్న మంచం వద్దకు వ్యాపించాయి. నడవలేని స్థితిలో ఉన్న యువతి మంటల మధ్య చిక్కుకొని విలవిలలాడింది. గట్టిగా కేకలు వేసే అవకాశం లేకపోవడంతో మంచం మీద దుస్తులతో పాటు అధికశాతం లావణ్య శరీరం కాలిపోయింది. చిన్నయ్య ఆచారి ఇంటి పక్కన పని చేస్తున్న బేల్దారులు లావణ్య పెద్దక్క కుమారుడు కిరీటికి మీ తాత ఇంటిలో నుంచి పొగలు వస్తున్నాయని సమాచారం ఇచ్చారు. వెంటనే తాతతో పాటు కిరీటీ ఇంటికి వచ్చారు. తలుపులు తీసి మంటలు ఆర్పివేశారు. 108కు సమాచారం ఇచ్చారు. 108 వాహనంలో పెద్దూరు నుంచి రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి లావణ్యను తీసుకొచ్చారు. ఇక్కడ వైద్యం అందించిన వైద్యులు తిరుపతి స్విమ్స్‌కు రెఫర్ చేశారు. ప్రైవేటు అంబులెన్స్‌లో తిరుపతికి తీసుకెళుతుండగా కుక్కలదొడ్డి స మీపంలో లావణ్య మృతి చెందింది. మృతదేహానికి రాజంపేట ఆసుపత్రిలో పోస్టు మార్టం ని ర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు.

**జెడ్పీ చైర్మన్ ఆకేపాటి పరామర్శ**

ప్రమాద విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పెద్దూరుకు వెళ్లారు.లావణ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.చిన్నయ్య ఆచారిని ఓదార్చారు.






## అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి



రవికుమార్ మృతదేహం

ములకలచెరువు: అతిగా మద్యం తాగిని కర్ణాటక వాసి మృతిచెందిన సంఘటన సోమవారం మండలంలో వెలుగు చూసింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... బెంగుళూరుకు చెందిన ఇంటినిర్మాణ మేస్త్రీ ఏ. సుబ్రమణి మండలంలోని అడివి చెరువు పల్లెలో ఇళ్లు నిర్మించడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇందుకోసం బెంగళూరుకు చెందిన రవి కుమార్ (47)ను తోడుగా తెచ్చుకున్నాడు. ఇతను ప్రతి రోజూ అతిగా మద్యం తాగేవాడు. కుటుంబ సభ్యులు లేకపోవడంతో తన వద్ద కూలీగా పెట్టుకున్నాడు. ఒంటరి తనం, చూసేవారు లేక మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం ములకలచెరువులో మద్యం తాగాడు. అడివిచెరువుపల్లెకు నడుచుకొని వెళ్తూ రోడ్డు పక్కలో పడిపోయాడు. అతిగా మద్యం తాగి ఉంటాడని, మత్తు దిగాక ఇంటికి వెళ్లిపోతాడులే అని అటువైపు వెళ్లే ప్రయాణికులు పట్టించుకోలేదు. మేస్త్రీకి మాచారం అందించారు. సోమవారం తెల్లవారు జామున సంఘటన స్థలానికి చేరుకొని చూస్తే రవికుమార్ మృతిచెంది ఉన్నాడు. వెంటనే ఎస్ఐ డీవై స్వామికి సమాచారం అందించాడు. ఎస్ఐ స్థానికులను విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



